ప్రజాశక్తి

సోమవారం 5 జూన్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఆర్‌బికెల్లో కానరాని 'భరోసా'

- మొక్కుబడిగా భూసార పరీక్షలు
- నిరుపయోగంగా డిజిటల్ కియోస్క్‌లు
- రైతులకు తప్పవని అవస్థలు



ప్రజాశక్తి- బాపట్లజిల్లా

రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ కేంద్రాల ద్వారా సింగిల్ విండో విధానంలో రైతులకు అవసరమైన అన్ని సేవలను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. విత్తనం నుంచి ఉత్పత్తుల విక్రయం వరకూ రైతులకు కావాల్సిన అని సేవలు ఆర్‌బికెలో పొందవచ్చునని ప్రకటించింది. ఆర్‌బికె చానెల్ ద్వారా రైతుల సందేహాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు నేరుగా మాట్లాడి సందేహాలు నివత్తి చేస్తారని తెలిపారు. వ్యవసాయ సలహా ▶ 2లో

ఏరువాక.. సాగారో..

- వ్యవసాయ పనులు ప్రారంభం
- నాగలి పట్టి పొలాలు

దున్నిన టిడిపి నేతలు



గిద్దలూరులో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఏరువాక ప్రారంభమైంది. రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ఏరువాక పౌర్ణమి కావడంతో రైతులు ఆనవాయితీగా పొలాల్లో పనులను రైతులు ఆదివారం ప్రారంభించారు. నాగలి పట్టారు. రైతులు భూములను దున్నే కార్యక్రమాలు పలుచోట్ల జరిగాయి. వర్షాలు కూడా పడటంతో భూములు కొద్ది రోజులుగా పదునుతోనే ఉన్నాయి. వ్యవసాయశాఖ కూడా ఖరీఫ్‌లో వేసే పచ్చిరొట్టె విత్తనాలను సిద్ధం చేసింది. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మేలో వర్షాలు కురియడంతో ముందుగానే ఏరువాక సాగడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ పరంగా ఈ కార్యక్రమాన్ని అధికారులు గతంలో మాదిరిగా చేపట్టలేదు. టిడిపి దీన్ని సంబరాలుగా చేపట్టింది. అన్నిచోట్ల ఆపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు నాగలి పట్టారు.దుక్కులు దున్నారు.రైతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా టిడిపి నేతలు కార్యకర్తలు పార్టీ పిలుపు మేరకు ఏరువాక కార్యక్రమాన్ని చేపట్టారు.కొండపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామి, దామచర్ల సత్య మద్దిపూడి మండలం కెల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్నారు. దుక్కులను దున్ని వ్యవసాయ పనులు చేపట్టారు. రైతులను అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం వదిలేసిందన్నారు.సబ్సిడీలు ఎత్తేస్తుందని విమర్శించారు.ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనూ పలుచోట్ల టిడిపి నేతలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులు చేపడుతున్నారు. కొన్నిచోట్ల భూములను దున్నారు. విత్తనాల వేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు. వర్షాలు బాగా కురిసిన ప్రాంతాల్లో పొలాలు విత్తనాలు వేసేందుకు అనుకూలంగా ఉన్నాయి. మేలో వర్షాలు భారీగానే కురిశాయి. చెరువులు నిండాయి. ఖరీఫ్ సాగుకు ప్రస్తుత పరిస్థితులు ఆశాజనకంగానే ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుభరోసా కింద రైతులకు ▶ 2లో

పత్తి ధర పతనం..

ధరలు లేక, దిగుబడులు రాక రైతులు కుదేలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతులు గత ఖరీఫ్ ఎన్నో ఆశలతో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవడీఉ మండలాల్లో 19 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. గతేడాది పత్తి క్వింటాల్ ధర రూ.12,300 పలికింది. దీంతో రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అకాల వర్షాలతో పంట నాశనమైంది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి ధర గత సెప్టెంబరులో క్వింటాల్ రూ.10,000 పలికింది. అనంతరం ధర పతనమవుతూ వచ్చింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నాటికి క్వింటా రూ.8,000 ఉండగా, మార్చిలో రూ. 6,300, మేలో రూ.5,200కు పడిపోయింది. ధర సగానికి పడిపోవడం, దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెడితే రూ.15,000 కూడా రాని పరిస్థితి నెలకొంది. అటు ధర లేక, ఇటు దిగుబడులు లేకపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు.



పత్తి దిగుబడులు

ధర తగ్గడంతో నష్టాలు: బోయలపల్లి దాసు, ఒడ్డుపాలెం



నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. నీటి వసతి లేకపోవడంతో ట్యాంకుల ద్వారా నీరందించాను. పంట చేతికి రావడంతో ఇంట్లో నిల్వ ఉంచాను. ధర పెరుగుతుందనుకుంటే పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. రూ.లక్షన్నర వరకు నష్టం వచ్చింది. క్వింటాకు కనీసం రూ.7,000 ధరతో కొనుగోలు చేస్తే నష్టాల నుంచి బయటపడొచ్చు.

రూ.65 వేలు పెట్టా: వెంకటేశ్వర్లు నాయక్, పిల్లికుంట తండా



ఎకరాకు రూ.65 వేలు పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. వాతావరణం అనుకూలించక దిగుబడి అరకొరగా వచ్చింది. ధర పెరుగుతుందిలే అనుకొని ఇంట్లోనే పత్తి మండె వేశాను. తీరా ధర తగ్గింది. తూకం తగ్గింది. ఎకరాకు రూ.15 వేలు చొప్పున నష్టపోయా. గత్యంతరం లేక దళారులు అడిగినకాడికే అమ్ముకోవాల్సి వస్తోంది.

ఆర్‌బికెల్లో కానరాని 'భరోసా'

(మొదటి పేజీ తరువాయి)

మండళ్లు ఏర్పాటు చేశారు. 1552515 నెంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్,ప్రత్యేక యాప్,కనీస మద్దతు ధర, రాష్ట్ర వ్యాప్తంగా అగ్రి టెస్టింగ్‌ల్యాబ్‌ల ఏర్పాటు, క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు, డ్రోన్ టెక్నాలజీ వినియోగం తదితర సదు పాయాలను రైతుల అభివద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, వ్యవసాయం, వాణిజ్య పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి నాలుగేళ్లు గడిచిపోయింది. వెనక్కి తిరిగి చూస్తే ఇవన్నీ ప్రచార అర్భాటాలు తప్ప ఆచరణలో రైతు భరోసా కేంద్రాలు రైతులకు చేరువైన దాఖలాలు లేవు. జిల్లాలో 25 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 459 గ్రామ పంచాయతీలు ఉండగా 410 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అందుబాటులోకి రాని భూసార పరీక్షలు

రైతులు వ్యవసాయ సీజన్‌ను భూసార పరీక్షలతో ప్రారంభిస్తారు. రైతులు పొలం బాట పట్టడానికి ముందే గ్రామాల వారీగా రైతులు కోరిన చోట భూసార పరీక్షలు నిర్వహించారు. పంటల సాగుకు ఇది కీలకం. భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలకు సంబంధించిన పరికరాలు నేటికీ అందు బాటులోకి రాలేదు. దీంతో భూసార పరీక్షలు అందుబాటులోకి రాలేదు. రైతు భరోసా కేంద్రాలు అందుబాటు లోకి వచ్చాక నాలుగో వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. అయినప్పటికీ భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. మండలాల్లో వందల సంఖ్యలో నిర్వహించాల్సిన పరీక్షలను మొక్కుబడిగా నిర్వహించారు.

నిరుపయోగంగా డిజిటల్ కియోస్క్‌లు

రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దిన ఈ పరికరం ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను తమ గ్రామం నుంచే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు. పంటల సాగులో నూతన పద్ధతులను వీడియోల ద్వారా చూడవచ్చు. అయినప్పటికీ డిజిటల్ కియోస్క్‌లు పూర్తి స్థాయిలో రైతులకు ఉపయోగపడుతున్న దాఖలాలు లేవు. సాధారణంగా రైతులు సీజన్‌లో తమకు తెలిసిన షాపుల నుంచి ఎరువులు, పురుగుమందులు అప్పు తెచ్చుకుని పంట దిగుబడులు విక్రయించి అప్పులు చెల్లిస్తుంటారు. అయితే రైతు భరోసా కేంద్రాల్లో ముందుగానే నగదు చెల్లించి ఎరువులు, పురుగుమందులు తీసుకోవాల్సిఉంది.

అందుబాటులోకి రాని బ్యాంకింగ్ సేవలు

జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న. పత్తి, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పొగాకు తదితర పంటలను రైతులు సాగు చేస్తారు. పంటల సాగు అవరమైన రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. బ్యాంకులు అందుబాటులో లేక రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీపై రుణాలు తెచ్చి నష్టపోతున్నారు.ఈ నేపథ్యంలో రైతులకు అవరమైన బ్యాంకింగ్ సేవలను ఆర్‌బికెల ద్వారా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం బ్యాంకింగ్ కరస్పాం డెంట్లను (బిసిలు) ఆర్‌బికెల్లో నియమించి వారి ద్వారా రైతులకు రుణాలు అందజేయాల్సిఉంది. అయినప్పటికీ జిల్లాలో ఎక్కడా ఆర్‌బికెల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందు బాటులోకి రాలేదు. బిసిలు ఆర్‌బికెల్లో రోజులో కొన్ని గంటలు పనిచేయడం ద్వారా రైతులు ఆన్‌లైన్‌లో నగదు జమలు, కొద్దిపాటి రుణం పొందడం సాధ్యమవుతుంది. ఒక్క ఆర్‌బికె లో కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు చేరువకాలేదు.

ఏరువాక..సాగారో..

(మొదటి పేజీ తరువాయి)

సాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇదే సమయంలో విత్తనాలు సకాలంలో అందించాల్సి ఉంది.పామూరు : రైతులను ఆదుకోవడం టిడిపికే సాధ్యమవుతుందని టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వగ్గంపల్లిలో ఏరువాక కార్యక్ర మాన్ని డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ వైసిపి పాలనలో రైతులు తీవ్రంగా నష్ట పోయినట్లు తెలిపారు. రైతులకు సబ్సిడిపై నాణ్యమైన విత్తనాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ వెంకటేశ్వర్లు, పువ్వాడ రామారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమి దున్నాడు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బోడపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, శివకోటేశ్వరరావు, నెమలయ్య, మాజీ ఎంపిపిలు మందలపు వెంకట్రావు, మస్తాన్, మాజీ జెడ్‌పిటిసిలు నాగరాజు, వరగాని పౌలు, సర్పంచి బోడపాటి మహేశ్వరి నారాయణస్వామి, మాజీ సర్పంచులు మేదరమెట్ల వెంకట్రావు, మానం నరసింహారావు, జిలెల్లమూడి చౌదరి, శ్రీనివాసరావు,బద్రి గోపాల్, చావా బ్రహ్మయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండల పరిధిలోని తాళ్లపల్లె గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పొలం దున్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజక పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : మండల పరిధిలోని అమానుగుడిపాడు ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ట్రాక్టర్‌తో పొలంలో దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, టిడిపి రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టేల వెంగళరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, నాయకులు గురిజేపల్లి జిలాని, కంచర్ల సత్యనారాయణ గౌడ్, తోటా మహేష్ నాయుడు, భాస్కర్, కిశోర్, కామేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొగదారమ్మ తల్లి అన్నసంతర్పణ

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం గ్రామ దేవత, మత్స్యకారుల ఇలవేల్పు మొగదారమ్మ తల్లి సిడిమాను మహెూత్స వాలు ఇటీవల ముగిశాయి. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైసీపీ నాయకులు మోపిదేవి హరినాథ్ బాబు సహాయ సహకారాలతో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆదివారం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ప్రారంభించారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమానికి వేల సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ముందుగా ఆలయంలో మొగదారమ్మ తల్లిని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని అన్నారు. నిజాంపట్నం గ్రామ దేవత మొగదారమ్మ తల్లి ఎంతో మహిమగల తల్లి అని, తల్లి ఆశీస్సులు ఈ తీర ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు అయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోటు యూనియన్ ప్రెసిడెంట్ కన్నా శీను, మాజీ బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీను, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా కార్యక్రమాల ప్రచార చిత్రాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు

వ్యర్థాల నుంచి ఉపయోగకరమైన వస్తువులు

జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్లలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలులో భాగంగా రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ఆదివారం జరిగింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రకాశం జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి గ్రామాల్లో వ్యర్థాల నిర్మూలన, స్వచ్ఛతా కార్యక్రమాల అమలు అంశంపై మాట్లాడారు. గ్రామాలలో రోజువారీ చెత్త సేకరణలో వచ్చిన ప్లాస్టిక్‌ని శుద్ధి చేసి, ప్లాస్టిక్ ష్రెడ్డర్ సహాయంతో చిన్న చిన్న ముక్కలుగా చేస్తే వాటిని రోడ్ల నిర్మాణాలలో, టీషర్ట్‌ల తయారీ వంటి వాటిలో ఉపయోగించవచ్చని తెలిపారు. గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా చేయాలని, అందుకు ముందుగా ప్రజలలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించి వాటి స్థానంలో జ్యూట్ బ్యాగ్, పేపర్ బ్యాగ్‌లను ఉపయోగించేలా మార్పు తీసుకొని రావాలని తెలిపారు. వర్క్ షాప్‌లో పలు అంశాలపై కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన శిక్షకులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 13 జిల్లాల జిల్లా పంచాయతీ అధికారులు, డిపిఆర్‌సి జిల్లా సమన్వయకర్తలు, ఎండివోలు, ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని పెనుముడి గ్రామంలో ఆదివారం క్రీస్తు లూథరన్ దేవాలయం ప్రతిష్ఠా మహెూత్సవం వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ హాజరయ్యారు. దేవాల యం అభివృద్ధికి రూ.1,00,116 విరాళం ఇచ్చారు. చర్చి ఫాదర్ వాక్యాన్ని బోధించారు. కార్యక్రమానికి ముందుగా నూతన దేవాలయ ప్రతిష్ట ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధర రావు, గుత్తికొండ రఘు, ఉప్పాల శ్రీను, ధనుంజయ, మాజీ సర్పంచ్ పెనుమూడి నాగేశ్వరరావు, సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

భార్య దూరమై.. బతుకు భారమై..

పట్టించుకొనేవారు లేక.. తనువు చాలించిన లారీ డ్రైవర్ ● తాను పనిచేసే లారీ కింద తలపెట్టి ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జీవితాంతం తోడు ఉంటుందనుకున్న భార్య కాలం చేయడం, ఇతర అనారోగ్య కారణాలు, పట్టించుకొనేవారు లేక.. తాను పనిచేసిన లారీ టైర్ కింద తలపెట్టి డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించిన ఘటన ఆదివారం వేకువజామున మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం గ్రామ సమీపంలోని స్టోన్ క్రషర్స్ వద్ద చోటుచేసుకుంది. అత్యంత హృదయ విదారకమైన ఈ ఘటనపై బాధితుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి మండలం ధర్మవరం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన చిలకా భాస్కర్‌బాబు(55) గత కొన్ని సంవత్సరాలుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య అనారోగ్యం పాలయి మృతి చెందడంతో తనది ఒంటరి జీవితమయ్యింది. దీంతో ఇటీవల కొంత మనస్తాపంతో ఉంటున్నాడు. గత ఆరు నెలలుగా అనారోగ్య కారణాలతో కంటి చూపు కొద్దిగా మందగించడంతో లారీని నడపలేక ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి వేళ తాను పని చేసిన లారీ దగ్గరకు వెళ్లిన భాస్కర్‌బాబు డౌన్‌లో నిలిపి ఉంచిన లారీ ఎక్కి గేర్ న్యూట్రల్ చేయడంతో లారీ మెల్లగా వెనక్కి కదులుతుండగా ఒక్కసారిగా లారీ నుంచి కిందకు దిగి కదులుతున్న లారీ టైర్ కింద తలపెట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జరిగిన ఘటనను సమీపంలోని స్థానికులు గుర్తించి మార్టూరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ కోడూరు కమలాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.



లారీ కింద తలపెట్టి తనువు చాలించిన చిలక భాస్కర్‌బాబు

సముద్ర స్నానానికి వెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి- కొత్తపట్నం

సముద్రంలో స్నానం చేస్తూ అలల తాడికి తాళలేక నీటి మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. మరో యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన కొత్తపట్నం మండల పరిధిలోని కొత్తపల్లెం వద్ద సముద్ర తీరాన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల సమచారం మేరకు... కొత్తపట్నం పల్లెపాలెంలో బంగారమ్మ తిరునాళ్ల నిర్వహించారు. తిరునాళ్ల చూసేందుకు శింరాయకొండకు చెందిన అవనిగడ్డ కార్తీక్, ఒంగోలుకు జితేంద్రసాయి(24) బంధువుల ఇంటికి వచ్చారు. సాయంత్రం సమయంలో ఇద్దరు కలిసి సముద్ర స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తున్న సమయంలో అలల తాడికి తాళలేక కార్తీక్ నీటిలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని గమనించి జితేంద్రసాయి కార్తీక్‌ను రక్షించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో జితేంద్ర సాయి కూడా నీట మునిగాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు జితేంద్రను ఒడ్డుకు చేర్చి ఆటోలో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కార్తీక్ ఆచూకీ లభ్యం కాలేదు. మృతుడు జితేంద్రలో హైదరాబాద్‌లో స్టాఫ్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న కొత్త పట్నం సాంబశివరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలు సుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జితేంద్ర సాయి (ఫైల్)

ఉప్పుగుండూరులో సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

జన్ భాగీదార్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉప్పుగుండూరులో సామాజిక సేవాకార్యకర్త రోజ్ స్టడీసర్కిల్ ప్రిన్సిపాల్ టి శామ్యూల్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులతో గ్రామ పురవీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపౌరుడు రానున్న తరాల కోసం భూమి మీద ఉన్న మానవజాతి సురక్షితంగా ఆరోగ్యంగా సంతోషంగా ఒక కుటుంబంగా జీవించడం కోసం పాటుపడాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టరు కె శ్యామ్ సునీల్ మాట్లాడుతూ జన బాగీదార్‌లో భాగంగా మొక్కలునాటడం, క్విజ్ పోటీలు, యోగ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ ఆఫీసరు డి రాజేంద్రప్రసాదు, ఏపిఓ ఎం హరికృష్ణంరాజు, మేనేజరు ఎం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి పూజలు

ప్రజాశక్తి-అద్దంకి

ఏరువాక పౌర్ణిమ సందర్భంగా బసవన్నలను అలంకరించి, అరకను పూజ చేసి, పొలంలో ఏరువాక సాగారు. కాకానిపాలెం, దామవారిపాలేనికి చెందిన రైతులు ఆరు జతల ఎడ్లతో ఏరువాక సాగారు. దేశానికి వెన్నెముక వ్యవసాయం. మనదేశంలో ఎక్కువగా వ్యవసాయం పశుజాతి మీద ఆధారపడి ఉంది. గోవులను పూజించుకోవడం, వ్యవసాయ పరికరాలను పూజించడం, నేలతల్లి గుండెలను చీల్చి వ్యవసాయం చేస్తున్నాం, క్షమించు నేలతల్లి అని భూదేవతను ప్రార్థించి, దుక్కి సాగును ఈ పౌర్ణమి రోజు మొదలెడతారని గోసంరక్షణ కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. రైతు తనకు, సమాజానికి అన్నం పెట్టే గోమాతను, వాటి సంతతి బసవన్నలను పూజించుకోవడమంటే వాటి రుణం తీర్చుకోవడమేనని, నేలతల్లి ఆశీస్సులుంటే పసిడి పంటలు పండుతాయని రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాస రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో చుండూరి మురళీసుధాకర రావు, శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, పిఎల్‌వి నర్సింహారావు, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, ఊటుకూరి రామకోటేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, తమ్మన శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, మహమ్మద్ రఫీ, గోశాల సుబ్బారావు పాల్గొన్నారు. జాగర్లమూడి శివకుమారి జన్మదినాన్ని ఏరువాక జరిపిన వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా జరిగింది.


ఏరువాక ప్రారంభోత్సవం

పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ రౌడీ షీటర్‌లను హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు వారి స్టేషన్ పరిధిలో ఉంటున్న రౌడీ షీటర్లు, చెడు నడత గల వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి ప్రస్తుత జీవన విధానం, వారి వృత్తి, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని నమోదు చేసుకొని కౌన్సెలింగ్ నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ స్టేషన్లో పరిధిలో నివసిస్తున్న రౌడీలు, పాత నేరస్తుల కదలికలపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని అన్నారు. వారితో సన్నిహితంగా వుండే వ్యక్తుల వివరాలు, జీవనోపాధి, ఇతర సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. వారు కలుస్తున్న వ్యక్తులపై నిఘా వుంచి, మరలా ఏదైనా నేరం చేసే అవకాశం ఉన్నదా అను సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఒక స్టేషన్ పరిధిలో నివాసం వున్న నేరస్తులు ప్రస్తుతం వేరొక పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నట్లయితే వారికి సంబంధించిన సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు తెలియపరచాలన్నారు. ఇలా నేరస్తులకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ అధికారులు పంచుకున్నప్పుడే నేరస్తులు చేయబోయే నేరాలను ముందుగానే గుర్తించి నియంత్రించడానికి అవకాశం ఉంటుందన్నారు. రౌడీ షీటర్లు ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో ఉండాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అన్నారు. పోలీస్ శాఖ ఆదేశాలను, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై పీడీ యాక్ట్ అమలుపరిచి జిల్లా బహిష్కరణ చేయడానికి కూడా వెనుకాడబోమని ఎస్పీ హెచ్చరించారు.

పంచాయతీ రాజ్ డిఇఇ శ్యాంప్రసాద్‌రావు బదిలీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు సబ్‌డివిజన్ పంచాయతీరాజ్ డిఇఇ సిహెచ్ శ్యాంప్రసాద్‌రావు బదిలీ అయ్యారు. వేమూరు సబ్ డివిజన్ డిఇఇగా బదిలీ చేస్తున్నట్లు ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు సబ్ డివిజన్‌కు నియామకం జరగలేదు. మార్కాపురంలో పని చేస్తున్న డిఇఇ పర్చూరు వచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మరో ఇంజనీరు పర్చూరు వచ్చేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

కనక నాగవరపమ్మను దర్శించుకున్న ఆర్డిఒ సరోజిని

ప్రజాశక్తి-వేటపాలెం

చీరాల ఆర్డీవో పి సరోజిని కుటుంబ సమేతంగా ఆదివారం స్థానికంగా ప్రసిద్ధి చెందిన కనక నాగవరపు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమ చీర చెల్లించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆలయం ఈవో జీవీల్ కుమార్, బండ్ల బాబు వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆర్డీవో సరోజినికి ఆలయ మర్యాదగా అర్చకులు పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరునాళ్ల మహోత్సవం ఆదాయం రూ.2,12,770 లభించింది. కనక నాగవరపు అమ్మ శిడి మహోత్సవం సందర్భంగా దేవదాయ ధర్మాదాయ బాపట్ల శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో ఆదివారం హుండీ లెక్కింపు జరిగింది. హుండీల ద్వారా రూ.82,424, విరాళాలు, షాపుల అద్దెలు, పసుపు కుంకుమ కానుకలు, ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం ద్వారా రూ.1,30,446, మొత్తం రూ.2,12,770 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఏ భానుమూర్తి, బండ్ల బాబు, ఇడుపులపాడు ఈవో శ్రీనివాస్, కర్లపాలెం ఈవో డి శ్రీనివాసరావు, తిమ్మసముద్రం ఈఓ ఫణి కుమార్, స్టాఫ్ పావని, సంజీవిరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.


ఆర్‌డిఒ దంపతులకు సత్కారం

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని పెద్దదాసలపల్లి గ్రామంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పగ్గాల వెంకటరమణ(28) చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు, మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ పెద్దలు మందలించారు. మస్తాపానికి గురైన వెంకట రమణ శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కనిగిరి ప్రభుత్వ హాస్పిటల్ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వైవి రమణయ్య తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.26,760 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: టంగుటూరులో వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి 15 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20,865 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వడ్డెపాలెంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,900 నగదును స్వాధీనం చేశారు. పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకొని వద్ద నుంచి రూ.13,965 నగదను స్వాధీనం చేసుకున్నారు. ఈ డాడుల్లో పోలీసు సిబ్బంది దండేల రవికుమార్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని బండ కాలనీలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి అరెస్టు చేసిన ఘటన ఆదివారం జరిగింది. బండ కాలనీలో ఐదుగురు పేకాట ఆడుతుండగా ఎస్ఐ కే సురేష్ తన సిబ్బందితో దాడి చేసి అదుపులో తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.4,300 స్వాధీనం చేసుకున్నారు.

విఆర్‌ఎ దుర్మరణం

ప్రజాశక్తి-మెదరమెట్ల

కొరిసపాడు మండలంలోని దైవాలరావురు గ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న ఉదరగుడి భానుచందర్(33) ఆదివారం ఉదయం రెండు గంటల ప్రాంతంలో తెలంగాణకు చెందిన నల్గొండ ప్రాంతంలో ట్రావెలింగ్ బస్సు, లారీ ఢీకొనటంతో అక్కడకక్కడే మతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామానికి చెందినవాడు. భాను మృతి పట్ల మండల రెవెన్యూ సిబ్బంది తమ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలియజేశారు.

మహిళా రెజ్లర్ల పోరాటానికి వ్యకాసం సంఘీభావం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, అతడి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంతనూతలపాడు వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావాన్ని తెలిపింది. ఆదివారం మండలంలోని బీ మాచవరంలో గ్రామ యువతతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బీజేపీ ఎంపి బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, స్థానిక యువత పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాల వల్లనే ప్రమాదాలు: సిపిఎం

రైలు ప్రమాద మృతులకు నివాళిగా బాపట్ల, చీరాల్లో కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఒడిస్సా రాష్ట్రంలో బాలాసోర్ వద్ద సంభవించిన రైలు ప్రమాదంలో చనిపోయిన ప్రయాణికులకు ఆదివారం బాపట్ల రైల్వే స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎన్నడూ లేని రీతిలో జరిగిన అత్యంత ఘోరమైన రైలు ప్రమాదంలో చనిపోయిన ప్రయాణికులను కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. గాయపడిన వారికి సత్వరమే వైద్య సహాయం అందేలా చూడడం ద్వారా మృతుల సంఖ్య పెరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదానికి కారణాలు ఏంటి అనేది తెలియడం కోసం సమగ్ర దర్యాప్తు చేయించాలని సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలు వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రయాణికుల భద్రతను గాలికి వదిలి,లాభాలు కోసం ప్రయత్నం చేయటం దురదృష్టకరమని అన్నారు. కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న ఆయన సొంత రాష్ట్రంలోనే ఇటువంటి ఘటన జరగటం దురదృష్టకరమని అన్నారు. రైల్వేల ప్రైవేటీకరణ కాకుండా ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మజుందార్, నాయకులు ఎన్ కోటేశ్వరావు, నాగేశ్వరరావు, భాస్కరరావు, ప్రసాద్, సుభాషిణి, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.





రైలు ప్రమాద మృతులకు బాపట్ల, చీరాల రైల్వే స్టేషన్ల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి

చీరాల: ఒరిస్సాలోని బాలసూర్ వద్ద జరిగిన రైల్వే ప్రమాద మృతులకు సిపిఎం చీరాల పట్టణ కమిటీ ఘనంగా నివాళులు అర్పించారు. చీరాల రైల్వే స్టేషన్ వద్ద జారిన కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు మాట్లాడారు. చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యంతోనే ప్రమాదం జరిగిందన్నారు. రైల్వేలో లక్షల పోస్టుల ఖాళీలు భర్తీ చేయకుండా ఉన్న కార్మికులపై పనిభారం పెంచడం వల్లనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో 300 మంది మరణించారని, 900 మంది గాయపడ్డారని అన్నారు. మూడు రైళ్లు ఒకే చోట ఒకదానికొకటి ఢీకొనటం దురదృష్టకరమన్నారు. రైళ్ల ప్రమాదానికి సాంకేతిక వైఫల్యం, మానవ తప్పిదాలే ప్రధాన కారణంగా కనిపిస్తుందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వెంటనే రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం వసంతరావు, పి కొండయ్య, శీలం రవికుమార్, ఎం లక్ష్మి, భారతి, పి కిరణ్, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పర్చూరు

ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ ఒప్పంద ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 8న గుంటూరులో జరిగే ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని ఏపిజెఏసి జిల్లా చైర్మన్ సిహెచ్ సురేష్‌బాబు కోరారు. పర్చూరులో ఆయన గోడపత్రికను ఆవిష్కరించారు. గుంటూరు కలెక్టరేట్ ఆవరణలో రెవెన్యూ కళ్యాణ మండపంలో 4వ ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని ఉద్యోగ, కార్మిక ఉపాధ్యాయులంతా పాల్గొనాలని సురేష్‌బాబు కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో తహశీల్దారు కె నెహ్రూబాబు, విఆర్‌ఓ సంఘం నాయకులు కె ప్రేమ్ కుమార్, సర్వే సంఘం నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాఘవయ్య సంతాపసభ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



మండలంలోని ఉప్పుగుండూరు గ్రామం పాలకేంద్రం అధ్యక్షులు భక్తయ్య విజ్ఞాన కేంద్రం సభ్యులు మాగులూరి రాఘవయ్య సంతాపసభ సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాగులూరి రాఘవయ్య పాలకేంద్రం అధ్యక్షులుగా గత 26 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు ఘుమారు 5సార్లు పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. పాలకేంద్రం బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. సొసైటీ అధ్యక్షులుగా 5సంవత్సరాల పాటు పని చేశారు. ఆయన హయాంలోనే సొసైటీ బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. మంచి కాంట్రాక్టరుగా కూడా గుర్తింపు పొందారు. పనిలో ఎటువంటి రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తారని పేరు ఉంది. ఆయన పాలకేంద్రం బిల్డింగ్ సొసైటీ బిల్డింగ్‌లతో పాటు మట్టిగుంట పంపింగ్ స్కీమ్ షెడ్డు, మహిళా బిల్డింగ్ మార్కెటింగ్ షెడ్డు, పంచాయతీ భవనం తదితర కట్టడాలు మంచి నాణ్యత ప్రమాణాలతో నిర్మించారు. పిడిసిసి సెంట్రల్ బ్యాంకు డైరెక్టరుగా కూడా పనిచేశారు. కశమ్మ వారి శ్రీరామమందిరం కమిటీ మెంబరుగా 1963 నుంచి పనిచేస్తూ అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు ఇచ్చేవారు. అలాంటి వ్యక్తి మరణించడం అనేక రంగాలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

రంగస్థలం నటులు సుబ్బారావు మృతి

ప్రజాశక్తి-మేదరమెట్ల



ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో హరిశ్చంద్ర, చింతామణి నాటకాలలో విభిన్న పాత్రలు పోషించి వందల ప్రదర్శనలు నిర్వహించి ప్రజలచే కళాకారుడుగా గుర్తింపు పొందిన ప్రముఖ రంగస్థల నటుడు సుబ్బారావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. హరిచంద్ర నాటకంలో విశ్వామిత్రుడు, కాలకౌశికుడు, వీరబాహుడు పాత్రలతో ప్రజలను మెప్పించారు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్రను వేసి ప్రజలను సంతోషపెట్టిన చలివేంద్ర సుబ్బారావు ఆదివారం మధ్యాహ్నం హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన అంతిమ సంస్కారాలు సోమవారం ఉదయం తమ స్వగ్రామమైన బొల్లావప్పాడు గ్రామంలో జరుగుతాయని కుటుంబీకులు తెలియజేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని పరిధిలోని మాచవరం గ్రామంలో ఆదివారం సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గుమ్మడి విజయ్ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంతనూతలపాడు నియోజకవర్గ అబ్జర్వర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా మాచవరం గ్రామంలోని కాలభైరవ స్వామివారి దేవస్థానంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పవరపు వీరయ్య చౌదరి మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ నాగలిని, వ్యవసాయ పరికరాలను, ఎడ్లను అలంకరించి పండుగలా చేసుకునే కార్యక్రమమే ఏరువాక పౌర్ణమి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సెల్వం, గ్రామ పార్టీ అధ్యక్షులు బెల్లం సురేంద్ర, ఉప్పుగుండూరు వార్డు సభ్యులు కనగల శ్రీనివాసరావు, మెట్టు సుబ్బయ్య, ముప్పాళ్ల గ్రామ పార్టీ నాయకులు కరణం అశోక్, తెలుగుదేశం పార్టీ నాయకులు బెల్లం నాగేశ్వరరావు, గోగినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక సాగుతున్న వేగేశన నరేంద్రవర్మ తదితరులు

రైతులంతా సుభిక్షంగా ఉండాలి

ఏరువాక సాగిన టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి-కర్లపాలెం

రైతులందరికీ ఏరువాక పౌర్ణమి అతి పెద్ద పండుగ అని, భూమిని, పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించే పండుగ ఇది అని బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఆదివారం కర్లపాలెం మండల పార్టీ కార్యాలయం నుంచి ట్రాక్టర్‌లతో భారీ ర్యాలీగా వెళ్లి పెద గొల్లపాలెంలోని పమిడి భాస్కరరావు పొలంలో పంట పొలాల్లో దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు చంద్రన్న పాలనలో వ్యవసాయాన్ని పండుగ చేసి లాభసాటి చేయగా, ఈ నాలుగేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్నదాతలు అప్పుల పాలయ్యారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయాన్ని దండగ చేశాడు. పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేవు. రైతు భరోసా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోళ్లు, రైతులకు యంత్ర పరికరాల పంపిణీలో వైఫల్యం, రైతు భరోసాను రైతు దగా చేసి, మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఊసే లేదు. ఆర్‌బికేల పేరుతో ఆర్భాటం తప్ప రైతుకు ఒరిగిందేమీ లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాక క్రాప్ హాలిడేలు ప్రకటిస్తున్నారు. పాత పథకాలకి పేర్లు మార్చి రైతుల కోసం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేశారన్నారు. రైతులకు కులాలు అంటగట్టి 15 లక్షల మంది రైతులకు, 14 లక్షల మంది కౌలు రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టారు. రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ పథకాలు రద్దు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు పెట్టుబడి కింద రూ.20,000 ఇస్తామని మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించడం జరిగిందన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఇప్పటికైనా రైతుల అవసరాలను గుర్తించి రైతుల సమస్యలను పరిష్కరించి రైతుల్ని ఆదుకోమని ఈ వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు ఉపాధ్యక్షులు పమిడి భాస్కరరావు, బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు, సర్పంచి నక్కల శేషాద్రి, బీసీ సెల్ నాయకులు పమిడి రవి, మాజీ ఎంపిటిసి షేక్ బాజీ, వసంత రెడ్డి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగన్ పాలనలో అరాచకం, అప్పులే..

టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా

ప్రజాశక్తి-భట్టిప్రోలు



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అప్పులు, అరాచకాలు తప్ప రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన జగన్మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా రాష్ట్రంలో రాజారెడ్డి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రాభివృద్ధిని విస్మరించి కక్ష సాధింపు చర్యగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రజల సాక్షిగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. గద్దెనెక్కగానే రాష్ట్రంలో అంచెలంచెలుగా మద్య నిషేధం విధిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి దానిని ఇంటింటికీ మద్యం పాలసీగా మార్చారని ఆరోపించారు. అలాగే ఉద్యోగులకు వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. ప్రతి జనవరి నెలలో నిరుద్యోగులకు ఇస్తానన్న జాబ్ క్యాలెండర్ ఎక్కడని ప్రశ్నించారు. 25 మంది ఎంపిలను గెలిపిస్తే తెస్తానన్న ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. సంపద సృష్టించటం చేతకాని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి 10 లక్షల కోట్ల అప్పుల ఊబిలో దించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. అబద్ధపు హామీలు, బూటకపు వాగ్దానాలతో రాష్ట్రం మరో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని అన్నారు. ఉద్యోగస్తులకు ప్రతి నెల జీతాలు కూడా ఇవ్వలేని దివాళా పరిస్థితికి రాష్ట్రం నెట్టబడిందన్నారు. అంధకారంలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని గాడిలో పెట్టడం అనుభవజ్ఞులైన నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమౌతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టిడిపి గెలుపు తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, డోలా శివకుమార్, వామనపల్లి కోటేశ్వరరావు, మండల నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

నూతలపాటి లక్ష్మయ్య సుబ్బాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంతనూతలపాడు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థులకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత తహశీల్దారు, రచయిత నూతలపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముద్రగడ కోటయ్య, జి శ్రీనివాసరావులు శిక్షకులుగా వ్యవహరించగా పి బాబురావు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. వైసిపి మండల్ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జడ్పిటిసి దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, ఇన్చార్జి ఎంపీడీవో డిఎస్వి ప్రసాద్, ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపల్ డివి రమణారెడ్డి పాల్గొన్నారు.

దిగుబడి ఫుల్.. ధరలు నిల్

- భారీగా పడిపోయిన నిమ్మకాయల ధరలు
- నష్టాల బాటలో రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిమ్మ కాయల దిగుబడి ఆశాజనంగా ఉంది. ధరలు లేక పోవడంతో రైతులు నష్టాల బాట పడుతున్నారు. వేసవి సీజన్‌లో నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉంటుంది. గతేడాది ఇదే సీజన్‌లో బస్తా నిమ్మకాయల ధర రూ. 3,500 పలికింది. ప్రస్తుతం రూ. 800 మించి అమ్ముడుపోవడం లేదు. వేసవిలో నిమ్మ కాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో నిమ్మ ధరలు పెరగాల్సి ఉంది. హైదరాబాదు, ఇతర రాష్ట్రాల నుంచి నిమ్మ కాయలు ఇక్కడిద రావడంతో ఈ ప్రాంత నిమ్మకాయలకు డిమాండ్ తగ్గింది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో రైతులు నిమ్మ పంటను 350 హెక్టార్లలో సాగు చేస్తున్నారు.



చెట్లపైనే పండి రాలుతున్న నిమ్మకాయలు

మార్కెటింగ్ సౌకర్యం లేక నిమ్మ సాగుపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపడం లేదు.

కోత కూలీలు రాక..

ఈ ఏడాది నిమ్మ తోటల్లో కాపు బాగానే వచ్చింది. ప్రస్తుతం సీజన్ కాపు కావడంతో ఎకరాకు 120 నుంచి 150 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.ధరలు అమాంతంగా పడిపోవడంతో కోత కూలీ కూడా రాక రైతులు కాయలు కోయకుండా వదిలేస్తున్నారు. దీంతో కాయలు రాలిపోయి నేలపాలవుతున్నాయి. కోసిన కాయలు ప్యాకింగ్ చేసి హైదరాబాదుకు ట్రాన్స్‌పోర్టు చేయాలి. ఇంత చేస్తే బస్తాకు రూ. 750 నుంచి రూ. 800 లోపే వస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరాకు రూ. 50 నుంచి రూ. 70 వేల వరకూ వివిధ రూపాల్లో పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారు. దిగుబడి ఉన్నా ధర లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు సత్కరిస్తున్న దాతలు

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పదో తరగతి పరిక్షల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులను విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం, విశ్వబ్రాహ్మణ సంఘం ఒంగోలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు కల్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పొతకమూరి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. మొదటి బహుమతిగా రూ.5,116 జూపూడి శ్రీనివాసచారికి అమృత హాస్పటల్ డాక్టర్ వి.కేశవ్ అందజేశారు. ద్వితీయ బహుమతిని చోడ నేహామృతకు కళ్యాణ మండపం అధ్యక్షుడు చోడ శ్రీనివాస్, కోశాధికారి మంచా బాబు అందజేశారు. మూడో బహుమతిగా కొనికి కోటేశ్వరరావుకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్లపాటి దొరసానాచారి అందజేశారు. అనంతరం విద్యార్థుల నుద్దేశించి ఆంజనేయస్వామి పేట అధిపతులు గోనుగుంట బ్రహ్మానంద సిద్ధాంతి మాట్లాడుతూ విద్యతో ఉన్నతస్థాయికి చేరవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆలూరి రామబ్రహ్మాచారి, తక్కెలపాడు శ్రీధర్, పిఎస్.బాబు, పాలెపు నాగభూషణాచారి, నూతలపాడు శేషాచారి, గోనుగుంట మోహనకృష్ణ శాస్త్రి, పత్తిపాటి వీరబ్రహ్మాచారి, కేనాల శ్రీనివాసరావు, మానేపల్లి గోవిందాచారి, ఆదిమూలం సుబ్బారావు, పూసపాటి నాగేంద్ర సాయి, సనాల శ్రీశైలం, చూడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పేదలు సాగు చేసుకున్న భూములకు పట్టాలివ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నడిగడ్డ, తెల్లగట్ల, వీరభద్రాపురం గ్రామాల్లో పేదలు భూములు సాగు చేసుకుంటున్నా నేటికీ వాటికి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. పలు గిరిజన గూడేల్లో అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా భూములను పంపిణీ చేయాలని ఆయన కోరారు. పశ్చిమ ప్రాంతంలో స్పందన కార్యక్రమాలు పెట్టడం వల్ల ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. అధికారులు గ్రామస్థాయిలో పర్యటించి పేదల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒంగోలులో నిర్వహిస్తున్న ప్రతి స్పందన కార్యక్రమంలో పశ్చిమ ప్రాంతం నుండే ఎక్కువ మంది పేదలు ముఖ్యంగా భూ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పశ్చిమ ప్రాంతంలో గ్రామస్థాయి నుంచి అధికారుల ద్వారా విచారణ చేయించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. చెరుకు కార్మికులకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దండా బాదర్‌రెడ్డి, కందుల ప్రభాకర్, షేక్ సుభాన్, చిలకాబత్తిని కోటేష్, గుర్రం లక్ష్మీ నారాయణ, భూమని వెంకటేశం, పోసాని నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాలి వెంకట రామిరెడ్డి




పలిపోయిన సైడ్ కాలువపై చప్టా

అక్కడ ఆదమరిస్తే అంతే సంగతి

- పలిగిపోయిన సైడ్ కాలువ చప్టా
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పామూరు

ఆర్‌టిసి బస్టాండ్‌లోకి వెళ్లే సమయంలో డ్రైవర్లు ఆదమరిస్తే ప్రమాదానికి గురికాక తప్పదు. ఆర్‌టిసి బస్టాండ్ ప్రక్కన సైడ్ కాలువపై ఉన్న చప్టా పగిలిపోయి సంవత్సరాలు గడస్తుంది. అయిన ప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇటీవల కారు అదుపు తప్పి దుకాణంలోకి దూసుకు పోయింది. దీంతో దుకాణంలోని యజమానులకు స్వల్ప గాయాల య్యాలయి. పట్టణంలోంచి ఆర్‌టిసి డిపోకి రావాలన్నా, బయటకు పోనాలన్నా అక్కడ ప్రమాదానికి గురికావాల్సి వస్తుందని వాహన దారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పలిగిపోయిన చప్టాలకు మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు, ప్రకజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛ ం అందజేస్తున్న ఆలయ ఇఓ

ఎమ్మెల్యేను కలిసిన ఇఓ

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం జెపి చెరువు గ్రామ సమీపంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయ ఇన్‌ఛార్జి ఇఓగా బి.రమేష్ భాద్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం టంగుటూరు మండలం వల్లురమ్మ దేవస్థానంలో ఇఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఇఓగా కొనసాగనున్నారు. అందులో భాగంగా ఇఓ రమేష్ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కన్నసాని ఓబులేసు తదితరులు ఉన్నాడు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి శాఖా గ్రంథాయలంలో విద్యార్థులకు ఆదివారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పటం, క్విజ్ ,కుర్చీలాట, ఇంగ్లీష్ పదాలు చెప్పడం తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొదిలి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పురిధిలోని ఏలూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆయన వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రానున్న ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ గుజ్జుల రమణా రెడ్డి, వైసిపి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, వైసిపి మండల మాజీ కన్వీనర్ గుజ్జుల సంజీవ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, జిల్లా ఆహార సలహా సంఘం సభ్యులు కొండ్రగుంట సుబ్బారావు, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, సర్పంచి తాళ్లూరి గంగయ్య, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు గుజ్జుల సుబ్బారెడ్డి, నాయకుడు ఉలవా గోపి, కార్యదర్శి శేషగిరి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్ : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి గిద్దలూరు నియోజక వర్గ నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాచర్ల మండలం జెపి చెరువు గ్రామంలో ఆదివారం ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. తొలుత పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న చేయూత, జగనన్న తోడు, వైఎస్ఆర్ ఆసరా పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1967-78, 1980-82 విద్యాసంవత్సరాల్లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నలభై ఎనిమిది ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై చేరి ఆనందంగా గడిపారు. అప్పటి విషయాలను నెమరు వేసుకుంటూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ లాంటి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, తీర్చిదిద్దిన గురువులను సన్మానించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురు స్నేహితులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రసాదరావు, సూరె వెంకటస్వామి, యక్కలి భాగ్యరావు, ఖాసిం, ఆవులయ్య, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

52 జీవోను రద్దు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రకాశం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బంజారా సోదరులందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించగలమని చెప్పారు. తమ సంఘం అన్ని రాష్ట్రాలలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా మంత్రూ నాయక్, అధ్యక్షుడి వెంకటేశ్వర్లు నాయక్, కార్యదర్శిగా బద్దే నాయక్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ నాయక్, కోశాధికారిగా బాలు నాయక్, యూత్ ప్రెసిడెంట్‌గా బద్దు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలాజీ నాయక్, రాంబాబు నాయక్, బాలనాయక్, సుధాకర్ నాయక్, చక్రీ నాయక్, యర్రగొండపాలెం సర్పంచి రామావత్ అరుణాబాయి, పుల్లలచెరువు జడ్‌పిటిసి వాగ్యా నాయక్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-జరుగుమల్లి

2023 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ముందుగా భూమిలో పచ్చి రొట్ట పైరులను సాగు చేసుకొని కలియదున్నుట ద్వారా భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉన్నట్లు ఎఒ డి.యుగంధరరెడ్డి తెలిపారు. సబ్సిడీపై అందజేసేందుకు పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, జనుమ,పిల్లి పెసలు రైతు భరోసా కేంద్రాల్లో అందులోబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. జీలుగలు పూర్తి ధర రూ.79 కాగా 50 శాతం సబ్సిడీపై రూ.39.50పైసలకు అందజేయనున్నట్లు తెలిపారు. జనుములు పూర్తి ధర రూ.84 కాగా సబ్సిడీపై రూ.42, పిల్లి పెసలు పూర్తి ధర రూ.97 సబ్సిడీపైపై రూ.48.50 పైసలకు అందజేయన్నుట్లు తెలిపారు. ఒక్కొక్క రైతు గరిష్టంగా ఐదు ఎకరాలకు సరిపడ విత్తనాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు ఎఒ తెలిపారు. మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయంలోప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

మండల పరిధిలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజరులు సత్యనారాయణ శర్మ, ప్రసాద్ శర్మ అర్చన, అభిషేకం, మహానివేదన, గోపూజ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ నర్రా నారాయణరెడ్డి పాల్గొన్నారు.

చెంబు మార్చ్‌తో

నేడు చలో నాయుడుపాలెం : వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు



మాట్లాడుతున్న అశోక్‌బాబు

గత టిడిపి ప్రభుత్వం హయాంలో స్వచ్ఛభారత్ కార్యక్ర మంలో భాగంగా కొండపి నియోజకవర్గంలో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే స్వామి అవినీతికి పాల్పడ్డారని, అందుకు నిరసనగా చెంబు మార్చ్‌తో సోమవారం చలో నాయుడుపాలెం నిర్వహిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. కొండపి రోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశ:లో అశోక్‌బాబు మాట్లాడారు. కొండపి నియోజకవర్గంలో దాదాపు 15 వేల మరుగుదొడ్లు నిర్మించకుండానే ఎమ్మెల్యే స్వామి, ఆయన అనుచరులు నిధులు దోచుకున్నట్లు ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే స్వామి కాజేసిన 15 వేల మరుగుదొడ్లకు సంబంధించిన రూ.22 కోట్లు తిరిగి చెల్లించేలా నియోజకవర్గ వ్యాప్తంగా మరుగుదొడ్ల లబ్ధిదారులతో చెంబులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్వామి బాధితులందరూ సోమవారం ఉదయం 9 గంటల కల్లా టంగుటూరులోని వైసినపి కార్యాలయానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు సూదనగుంట శ్రీహరిరావు, నియోజకవర్గ వైసిపి నాయకుడు దివి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో అడుగు పెట్టనీయ్యం : టిడిపి

వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు చేపడుతున్న నిరసన కార్యక్రమం గురించి సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకులు తీవ్రంగా స్పందించారు. వరికూటి అశోక్ బాబుతో సహా ఆయన తొత్తులెవరూ ఎమ్మెల్యే స్వామి స్వగ్రామం తూర్పునాయుడుపాలెం గ్రామంలో అడుగు కూడా పెట్టలేరని తేల్చి చెప్పారు. వైసిపి నాయకులు వెయ్యి మందితో వస్తే తాము రెండు వేల మందితో తూర్పునాయుడుపాలెం గ్రామం జాతీయ రహదారి పొలిమేరలో అడ్డుకునేందుకు సిద్ధంగా ఉంటామని టిడిపి ఎస్‌సి సెల్, ఇతర విభాగాల నాయకులు హెచ్చరించారు. కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ప్రస్తుత వైసీపీ నాయకుల అవినీతి చిట్టాలు త్వరలోనే బహిర్గతమవు తాయని చెప్పారు. తూర్పు నాయుడుపాలెంలో ఇరు పార్టీల నాయకుల మధ్య వైరం జరిగే అవకాశాలున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. టంగుటూరు పోలీసులతో పాటు కొందరు స్పెషల్ పార్టీ పోలీసులతో చెంబుల మార్చ్ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకుని బందోబస్తును పర్యవేక్షించేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు.



బాండు అందజేస్తున్న ఆర్ఎంపి వైద్యుల సంఘం నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంగోలు సబర్బన్ : పొన్నలూరు మండలం విప్పగుంట గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు పెళ్లూరు వీరబ్రహ్మయ్య మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు వివిధ మండలాలకు ఆర్ఎంపి వైద్యులు రూ.1,75,000 ఆర్థిక సాయాన్ని ఆదివారం అంద ్జేశారు. ఒంగోలు, పొదిలి, నాగల్పుల పాడు, పొన్న లూరు శింగరాయకొండ, కందుకూరు మండలాలకు ఆర్ఎంపి వైద్యులు ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. నగదు బ్యాంకులో డిపాజిట్ చేసి మృతుడి భార్యకు బాండు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్ఎంపి వైద్యులు పొన్నలూరు మండల అధ్యక్షుడు వి. శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బట్టు బాలాజీ రావు, గౌరవాధ్యక్షుడు, మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి కె.బాలచంద్రన్, పెళ్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రి సురేష్

నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని భ్రమరాంబ డిగ్రీ కళాశాల చైర్మన్ భట్టు రమణారెడ్డి కుమార్తె ప్రవలిక దంపతుల రిసెప్షన్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఈ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెన్నకృష్ణ

ప్రజాశక్తి-పామూరు



మాట్లాడుతున్న డాక్టరు టి చెన్నకృష్ణ

మండల కేంద్రమైన పామూరులో జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి. చెన్నకృష్ణ బాలోత్సవాన్ని ఆది వారం ప్రారం భించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు, విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానాన్ని, వినోదాన్ని, వికాసాన్ని పెంపొందించు కోవాలన్నారు. దేశభక్తి, సమాజ సేవలతో పౌరులుగా ఎదగాల న్నారు. బాలోత్సవంలో పాల్గొనే విద్యార్థులకు పాటలు, డ్యాన్స్, డ్రాఫ్టింగ్, బొమ్మలు వేయడం, సైన్స్, మ్యాథమ్యాటిక్స్, మ్యాజిక్స్, కవితలు, కథలు, సైన్స్‌తో సరదాలు, పేపర్ క్రాఫ్టింగ్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమ్మర్ క్యాంపును ఈనెల 8 వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సయ్యద్ షమ్మీ, బత్తుల పరిమళాదేవి తెలిపారు. అనంతరం విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక నాయకుడు కె. శంకర్, యుటిఎఫ్ నాయకుడు జె. వెంకట్రావు రాత పుస్తకాలు, పెన్సిల్స్, రబ్బరు, చాక్‌మార్ అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు షేక్ ఖాదరున్నీషా, సయ్యద్ రమీజా, కె. ధనలక్ష్మి, అంకమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి-కొండపి



సర్టిఫికెట్లు అందజేస్తున్న సిఐ

తైక్వాండో నేర్చుకోవడం ద్వారా శారీరక, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని కొండపి సిఐ పాండురంగారావు తెలిపారు. మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణాల్లో ఎంతో ఖర్చు చేసేగాని తైక్వాండో, స్పోకెన్ ఇంగ్లీషు లాంటి శిక్షణ దొరకదని తెలిపారు. గ్రామీణ ప్రాంథం విద్యార్థులకు ఉచితంగా తైక్వాండో శిక్షణ అందిస్తున్న మన ఊరి వికాసం కార్యకర్తలు, ఎన్ఆర్ఐ దాతలు ధర్మవరపు ప్రసాదు, బెజవాడ వెంకట్‌ను ఈ సందర్భంగా సిఐ అభినందించారు. అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ ప్రసాదు మాట్లాడుతూ కట్టావారిపాలెం , కొండపి విద్యార్థులు జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి బంగారు పతకాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, వైస్ ఎంపిపి ఆర్.కోటరాజు , బెజవాడ బంగారయ్య, వీరమోసు మస్తానరావు, మన ఊరి వికాసం కమిటీ గౌరవాధ్యక్షుడు గుంటుపల్లి పద్మావతి, కొండపి ధ్యాన మండలి అధ్యక్షుడు బాలబ్రహ్మాచారి, షిరిడీ సాయిబాబా మందిరం అధ్యక్షుడు అద్దేపల్లి శ్రీనివాసరావు, తైక్వాండో అంతర్జాతీయ శిక్షకులు కిశోర్, శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకుంటారా? స్థలం వదులుకుంటారా?

పక్కాగృహాల లబ్ధిదారులపై అధికారుల ఒత్తిడి ● పట్టాలు రద్దు చేస్తామంటూ నోటీసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అర్హులైన పేదలందరికీ నివేశన స్థలం ఇచ్చి, పక్కాగృహాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి పట్టాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయం చాలా తక్కువగా ఉండటంతో గృహ నిర్మాణాలు ప్రారంభించేందుకు చాలామంది లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు బేస్‌మెంట్ నిర్మాణానికి కూడా సరిపోదని వాపోతున్నారు. నిర్మాణాలు చేపట్టినవారు రూ.లక్షల్లో అప్పులు చేయాల్సి వస్తుండటంతో బిక్కచచ్చిపోతున్నారు. మిగతా వారు తామెక్కడ అప్పు తేవాల్సివస్తుందో అని భయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల స్థలాలను రద్దు చేస్తామంటూ గృహ నిర్మాణ శాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిందని, ఇప్పుడు పట్టాలు రద్దు చేస్తామని ప్రకటించటం అన్యాయమని వాపోతున్నారు.

పెరిగిన ధరలతో పేదల ఆందోళన..

యర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా దగ్గర ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో మొత్తం 1,316 మందికి ఇండ్ల పట్టాలు మంజూరు చేశారు. వారిలో 836 మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయి. అయితే 194 మంది లబ్ధిదారులు తాము ఇప్పుడు పక్కా గృహాలు నిర్మించుకోలేమని చెప్పడంతో వాటిని రద్దు చేశారు.



జగనన్న కాలనీ

ప్రస్తుతం 542 మందికి అదే లే అవుట్‌లో పక్కా గృహాలు మంజూరయ్యాయి. అయితే వాటిలో కూడా ఎక్కువ మంది లబ్ధిదారులు పక్కా గృహాలు నిర్మించుకోవటానికి ముందుకు రాకపోవడంతో 340 మంది లబ్ధిదారులకు విఆర్వోలు, గృహ నిర్మాణ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో 70 పక్కా గృహాలు పూర్తయ్యాయి. 212 పక్కా గృహాలకు బేస్ మట్టాలు నిర్మించారు. 14 పక్కా గృహాలు గోడల వరకు నిర్మించారు. నాలుగు పక్కా గృహాలకు శ్లాబులు వేశారు.

నిర్మించి ఇవ్వాలని వినతి..

ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసే రూ.1.80 లక్షలు సరిపోవడం లేదని అధికారుల విచారణలో వెల్లడవుతోంది. గృహ నిర్మాణానికి అవసరమయ్యే సిమెంటు, ఇనుము, ఇసుక, కంకర ధర అధికంగా ఉంది. వీటితో పాటు భవన నిర్మాణ కార్మికుడికి రోజుకు రూ.800 కూలి చెల్లించాలి. బేస్‌మెంట్ స్థాయి వరకు కట్టుకునేందుకే రూ.1.50 లక్షల పైగా ఖర్చవుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నిరుపేదలు, రోజువారీ కూలీలు నిర్మాణం చేపట్టలేని పరిస్థితి. ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందంటే దరఖాస్తు చేసుకున్నామని, తాము సొంతంగా కట్టుకోలేమని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.

15 లోగా నిర్మించుకోకుంటే పట్టాలు రద్దు
సురేష్, హౌసింగ్ డీఈ, యర్రగొండపాలెం

మిల్లంపల్లి టోల్‌ప్లాజా సమీపంలోని జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు ఈ నెల 15వ తేదీలోగా నిర్మాణాలు ప్రారంభించుకోకపోతే స్థలం రద్దు చేస్తాం. ఇప్పటికే చాలాసార్లు గడువు ఇచ్చాం. నిర్మాణాలు ప్రారంభించాలని నోటీసులు జారీ చేస్తున్నాం. నిర్మాణాలు చేపట్టేలా ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి. దీనికి తోడు ఈ నెల 2వ తేదీన త్రిపురాంతకంలోని జగనన్న లే అవుట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్వయంగా ఈ నెల 15వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే వారి పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించడంతో నియోజకవర్గంలోని లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాదు పేర్కొన్నారు. మండల కేంద్రమైన నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ మిషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శనివారం రాత్రి శంఖుస్థాపన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పాలడగు విజేంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విక్టర్ ప్రసాదు మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాధికారానికి అడుగులు వేయాలన్నారు. ఇప్పటికైనా రాజ్యాధికారం రావాలంటే అందరు ఐక్యంగా ఉండి దళిత పేటల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేయాలని, వారికి అండగా నిలిచినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారన్నారు. ఆయన రచించిన రాజ్యాంగంతోనే అనేక తరగతుల వారు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అంబేద్కర్ అందరివాడే తప్ప కేవలం ఎస్‌సిలకు చెందిన వాడు కాదని ఈ సందర్భంగా తెలిపారు. బడుగు బలహీనవర్గాల ముక్కలుగా ఉన్నవారంత ఐక్యం కావాలని పిలుపునిచ్చారు కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్



మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు నేపద్యంలో 1235జిఓ ప్రకారం ప్రతి దళిత పేటల్లోఋ2ఏకరాలు స్మశానికి కేటాయించవలసి ఉందని కాని ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదన్నారు నాగులుప్పలపాడు మండలంలో అనేక చోట్ల స్మశాన స్థలాలు లేవని తెలిపారు. అందుకు కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ప్రసాదు కృషి చేయాలని కోరారు. అందుకు స్పందించిన ఆయన ఇటీవలనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి జిల్లా కలెక్టర్లకు శ్మశాన స్థలాలు కేటాయించాలని జిఓ జారీ చేసినట్లు తెలిపారు. ఆ దిశగా మండలంలో కూడా దళితపేటల్లో శ్మశాన స్థలం లేనిచోట స్థలం కేటాయించాలని స్టేజీ మీద ఉన్న ఇన్‌చార్జి తహశీల్దార్ జయలక్ష్మికి సూచించారు. ఈ కార్యక్రమంలో దాసరి చెన్నకేశవులు, చప్పిడి వెంగళరావు, నిర్వాహకులు జి సుబ్బారావు, తహశీల్దార్ ఎన్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రితిక్ సాయి

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రేపల్లె: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రితిక్ సాయి అన్నారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డిఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రితిక్ సాయి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఆశయంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ రేపల్లె రూరల్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆపరేషన్ అవసరం అయిన వారికి ఉచితంగా ఆపరేషన్ చేసి పంపించనునట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు ఎమ్ఎమ్ సక్సేనా, డాక్టర్ వసంతం వీరారాఘవయ్య పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం: హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామానగర్‌లోని డాక్టర్ మధు క్లినిక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర ఆదివారం ఉచిత మజ్జిగ పంపిణీ పిచ్చుక సూర్య నాగలక్ష్మి కోడలు పిచ్చుక దుర్గా పద్మావతి చేతుల మీదుగా జరిగింది. ఇందుకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని పిచ్చుక బవ్రాజు, ఎన్నారై పింజల సురేంద్ర అన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గుగ్గిలం శ్రీహరి, సభ్యులు డాక్టర్ మధు, పిచ్చుక బావ్రాజు, దుర్గా పద్మావతి, భైన నందకుమార్, బుద్ధి శ్రీను, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీఎన్ మల్లికార్జునరావు, వైకేవి సోమరాజు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆత్మహత్యకు పాల్పడిన సాకే గంగాధర్ కుటుంబానికి రూ.పది లక్షల సహాయం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత సంక్షోభానికి కారణమైన నూలు, రంగులు, రసాయనాలు, చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్‌టిని వెంటనే ఎత్తివేయాలని



మాట్లాడుతున్న మురుగుడు సత్యనారాయణ

డిమాండ్ చేశారు. అలాగే చేనేత సొసైటీల్లో, మాస్టర్ వీవర్ల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి చేనేత కుటుంబానికి 20 శాతం రాయితీపై రెండు లక్షల ముద్ర రుణాలు అందించాలని, ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు సొసైటీ మాజీ అధ్యక్షులు బట్టు నాగ మల్లేశ్వరరావు, నాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.



భట్టిప్రోలులో ఎంఆర్ఆర్ అండ్ ఏవిఎస్ జూనియర్ కాలేజి

భట్టిప్రోలు మటూరు జూనియర్ కాలేజీ ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మటూరు రామారావు ఆదర్శ విద్యా సమితి జూనియర్ కాలేజీ నూతన విద్యా సంవత్సరం ఆరంభ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 1981లో ప్రారంభమైన ఈ కళాశాల గ్రామీణ ప్రాంతంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దింది. విద్యార్థులు అడ్మిషన్ కొరకు కళాశాలలో వివరాలు తెలుసుకొని చేసుకోవాలని కరస్పాండెంట్ మటూరు తాండవ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించండి

ప్రజాశక్తి-వేటపాలెం

ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఆఫీస్ వారి పర్యవేక్షణలో పర్యావరణ దినోత్సవం జూన్ 5 సందర్భంగా జరుగుతున్న ప్రచార కార్యక్రమాలలో భాగంగా ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు, ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే ఇక్కట్ల గురించి వివరించారు. మిషన్ లైఫ్‌లో మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకునే విధంగా అవలంబించవలసిన పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన అనేక జాగ్రత్తలపై గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ వారి కళాకారుల బృందం చేత కళాజాతా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వై రాజా, ఎం మోహన్ పాల్గొన్నారు.

పెదగదేలవర్రులో ఏరువాక ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు (చుండూరు)

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం చుండూరు మండలం పెదగదేలవర్రు గ్రామంలో మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు నాగలి దున్ని ఏరువాకను ప్రారంభించారు. అలాగే చంద్రబాబు ప్రకటించిన గ్యారెంటీ భవిష్యత్ పథకాలకు గాను చంద్రబాబు చిత్రపటానికి వరి వడ్లుతో అభిషేకం చేశారు. టిడిపి పాలనలో వ్యవసాయం వృద్ధి రేటు సాధించిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయ క్షీణించి రాష్ట్రం అప్పుల పాలయ్యిందన్నారు. ముందుగా వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రార్థనలో ముస్లిములు

మసీదు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-రేపల్లె: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణ పరిధిలోని 24వ వార్డులో నూతన మసీదు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రంజాన్ పండుగకు ప్రభుత్వం తరఫున కానుకలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉండి ఐక్యతతో పట్టణభివృద్ధిలో పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు మసీదు పెద్దలు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల ఉపాధిని కాపాడాలి : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు

చీమకుర్తి : గ్రానైట్ పరిశ్రమ మనుగడను నిలబెట్టి కార్మికుల ఉపాధిని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు కోరారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ చైనా బయ్యర్లు రాక తగ్గడం,గ్రానైట్‌కు మార్కెట్ తగ్గడం వల్ల క్వారీలో ముడిరాయి ఎగుమతులు తగ్గాయన్నారు. పోర్టు నుంచి విదేశీ ఎగుమతుల ఛార్జీలు పెరగడం వల్ల వియత్నాం కంటైనర్ల రాక పోకలు తగ్గినట్లు తెలిపారు. అదేవిధంగా పాలిషింగ్ రాయి ఎగుమతులు తగ్గాయన్నారు.కోవిడ్ కాలం నుంచి కొనసాగుతున్న సంక్షోభం, అంతర్జాతీయ పరిస్థిలు, కేంద్ర ప్రభుత్వ వినాశకర విదేశీ విధానాలు ,రాష్ట్ర ప్రభుత్వ భారాలు గ్రానైట్ పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టబడినట్లు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ వినాశకర విధానాలు మానుకొని పరిశ్రమను ప్రోత్సహిస్తే ఉద్యో,కార్మిక ఉపాధి నిలబడుతుందన్నారు. రాయల్టీని తగ్గించాలన్నారు. ,శ్లాబ్ విధానాన్ని పగడ్బందీగా అమలు చేయాలన్నారు. విద్యుత్‌పై రాయితీ ఇచ్చి పరిశ్రమను ఆదుకోవాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రానైట్ పరిశ్రమను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోకపోతే యజమానులు, కార్మికులను కూడగట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రానైట్ పరిశ్రమను కాపాడి ఉపాధి నిలబెట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. బెజవాడశ్రీను అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు, మండల కమిటీ నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి,టి. రామారావు, కంకణాల వెంకటేశ్వర్లు, పొత్తూరి సురేష్, పులి ఓబులరెడ్డి, బి. వీరాంజనేయలు, కుమ్మిత శ్రీనివాసులరెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలలో

రైతాంగ సమస్యలే ఎజెండా కావాలి

రైతు సంఘాల నాయకులు, వక్తల పిలుపు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల నేతలు


ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికలలో దేశంలోని రైతాంగ సమస్యలే ఎజెండాగా ఎన్నికలు జరగాలని అందుకు తగ్గట్టు రైతులు తమ డిమాండ్ల మేనిఫెస్టోను విడుదల చేయాలని రైతు సంఘాల నాయకులు, వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఆచార్య రంగా భవనంలో ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత త్రోవగుంట అండర్ వే బ్రిడ్జి వద్ద నుంచి చీరాల-దిగమర్రు రోడ్డులో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాధీశ్వర రావు ప్రారంభించారు. అనంతరం ఆచార్య రంగా భవన్ లో నిర్వహించిన సభకు ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాధీశ్వరరావు మాట్లాడుతూ దేశం లో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేని కారణంగా రైతాంగానికి తగిన గౌరవం దక్కటం లేదన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను కేవలం ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారన్నారు కర్ణాటకలో రైతు సంఘాలు ఐక్యంగా ఉండి రాజకీయ శక్తిగా ఎదగడమే కాకుండా ఓ ఎమ్మెల్యే సీటు గెలుచుకొని రైతుల సత్తాను చాటారన్నారు. కర్ణాటక రైతాంగ స్ఫూర్తిని తీసుకొని రానున్న సార్వత్రిక ఎన్నికలలో రైతుల సమస్యలే ప్రధాని ఎజెండాకా అన్ని రాజకీయ పార్టీలు చర్చించేలా ఉద్యమాలు నడపాలన్నారు. జీన్ క్యాంపెయిన్ ఫౌండర్, సైంటిస్ట్ సోషల్ యాక్టివిస్ట్ డాక్టర్ సుమన్ సహాయ్ మాట్లాడుతూ వ్యవసాయంలోకి కొత్త తరం రావాలంటే ఆ రంగం లాభసాటిగా మారాలన్నారు. అందుకు ప్రభుత్వాలు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం రైతే రాజన్న ప్రభుత్వాలు ఇప్పుడు రైతుల గురించి పట్టించుకోవడం మానేశాయన్నారు. కర్ణాటక రాజ్య రైతు సంఘం గౌరవాధ్యక్షుడు సామరస పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. అదేవిధ:గా రైతులు అప్పులు కూడా పెరిగాయన్నారు. కార్పొరేట్ శక్తులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులపై గిట్టుబాటు ధరలు ముద్ర వేసి అమ్మకాలు జరుపుతుండగా రైతాంగం పండించిన పంటకు మాత్రం గిట్టుబాటు ధరలు చెప్పుకునే అర్హత రైతులకు లేకపోవడం దుర్మార్గమన్నారు. కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షులు నాగేంద్ర మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని రైతాంగానికి కర్ణాటకలోని రైతాంగానికి సమస్యలు ఒకటేనన్నారు. రైతాంగ సమస్యలకు కారణమైన బిజెపిని కర్ణాటక రాష్ట్రం నుంచి ఎన్నికలతో తరివేసామన్నారు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ఒకవైపు మూడు చట్టాలను రద్దు చేస్తామని పేర్కొంటూ మరోవైపు రాష్ట్రాలలో ఆ చట్టాల అమలు ను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ గతంలో రైతులు ఏరువాక కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరుపుకునే వారన్నారు .దేశంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు జరిగితే తిరిగి రైతుల కుటుంబాల్లో ఆనందం విరాజిల్లుతుందన్నారు. అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలకులను కాకుండా తమ ప్రవత్తిని నమ్ముకుని ముందుకు సాగుతున్న వారే రైతులన్నారు. అనంతరం ఎఐకె ఎఫ్ రాష్ట్ర నాయకుడు మర్రెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, రైతు స్వరాజ్ వేదిక రాష్ట్ర కోకన్వీనర్ బాలు గాడి, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హనుమా రెడ్డి, సుబాబుల్ జామాయిల్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. వీరారెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాదీశ్వరరావు రచించిన వాతావరణ మార్పులు ప్రకతి వైపరీత్యాలు రైతులకు నష్టాలు కలిగించేదెలా అనే అంశంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతపురం స్మార్ట్ మీటర్ల పోరాట యోధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం నాయకులు దేవరపల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం

- అందుబాటులో భూసార పరీక్షలు
- ఆర్‌బికెల ద్వారా ఎరువులు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్

ముఖాముఖి



ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతుల శ్రేయస్సే ధ్యేయంగా వ్యవసాయ శాఖ పని చేస్తున్నట్లు బాపట్ల జిల్లా వ్యవసాయశాఖాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. పంటల సాగు మొదలు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించేంత వరకు అన్ని అంశాల లోను రైతులకు అండగా ఉంటున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, సేవల గురించి ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

రైతులకు అన్ని అంశాలోను అండగా ఉండేందుకు బహుళ ప్రయోజనకర ఉపయోగం కోసం రాష్ట ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలు అందులో బాటులోకి తెచ్చింది. భూసార పరీక్షలు, పంటల సాగులో మెళుకువలు తెలియజేడం, రైతులకు కావాల్సిన సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం అందించడం, సబ్సిడీపై యంత్ర ఎమగ్రిని అందించడం. పొలంబడి ద్వారా వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు రైతుల వద్దకు చేరేలా రైతు భరోసా కేంద్రాల ద్వారా కృషి జరుగుతోంది.

భూసార పరీక్షలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలను అందుబాటులోకి వచ్చాయి. త్వరలోనే అగ్రి లాబ్‌లు రైతులకు అందుబాటులోకి రానున్నాయి. భూసార పరీక్షలు జరిపి సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్ కార్డులు ఇస్తారు. పంటల దిగుబడికి భూసారమే కీలకం . ఈ నేపథ్యంలో ప్రతి ఆర్‌బికె నుంచి ముందుగా రెండు చొప్పున మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల కోసం ప్రాంతీయ భూసార పరీక్షా కేంద్రాలకు పంపారు. పోషక లోపాలు గుర్తించి రైతులకు సలహాలు ఇస్తారు. రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే ముందుగా భూసార పరీక్షలు అవసరం. రైతులు పొలం బాట పట్టడానికి ముందు గ్రామాల వారిగా భూసార పరీక్షలు నిర్వహించి పంటల సాగుకు భూమిలోని లోపాలను తెలుసుకుని తదనుగుణంగా రైతులకు అవసరమైన జిప్సం, బోరాన్, జింక్ అందజేస్తున్నారు.

ఈ - పంట నమోదు

జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 1,23,170 హెక్టార్లు ఉంటుందని అంచనా వేశారు. అందులో వరి సాగు 1,09,169 హెక్టార్లు, పత్తి 5,582, మినుము 2,005, కంది సాగు 2,311 హెక్టార్లు ఉంటుందని అంచనా. రైతులు తాము చేసిన పంటల వివరాలను తప్పని సరిగా నమోదు చేయించుకోవాలి. అదేవిధంగా ఇకెవైసి కూడా చేయించుకోవాలి. ఈ- పంట నమోదు అయితేనే రైతు భరోసా ,పంటల బీమా, పంట నష్ట పరిహారం, ధాన్యం సేకరణ, సున్నా వడ్డీ పంట రుణాలు, సబ్సిడిపై యంత్ర పరికరాలు అందజేస్తారు. జిల్లాలో గతేడాది 36,363 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో 38,180 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

అందుబాటులో ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన 27,286 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 9,766 , డిఎపి 2,350,ఎంఒపి 512, ఎన్‌పికె కాంప్లెక్స్ 12,623, ఎస్‌ఎస్‌పి 2,030 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

అందులో ఉన్న పథకాలు

వైఎస్‌ఆర్ రైతు భరోసా, పిఎమ్ కిసాన్ పెట్టుబడి సాయం,మట్టి నమూనాల సేకరణ, విత్తనాల పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశాల నిర్వహణ, రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు,పురుగుమందుల పంపినీ చేస్తున్నారు. పొలంబడి నిర్వహణ,యంత్ర పరికరాల పంపిణీ, ఈ క్రాప్ నమోదు,రైతు గ్రూపుల ఏర్పాటు చేస్తున్నారు.